విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 5, డిసెంబర్ 2024

పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి

- హామీలతో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది
- 6 నెలల వ్యవధిలో రూ.15.485 కోట్ల భారం మోపడం దారుణం
- సర్దుబాటు పేరుతో దగా..
- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాలెం నారాయణ స్వామి

విశాలాంధ్ర-బుక్కరాయసముద్రం: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ నాయకులు బుధవారం మండల తాహసిల్దార్ పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాలెం నారాయణ స్వామి మాట్లాడుతూ ప్రజలకు అనేక హామీలు గుప్పించి, మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీలను నెరవేర్చడంలో విఫలం అయిందని, ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలను ఏమాత్రం పెంచమని చెప్పిన కూటమి నాయకులు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన 6 నెలల వ్యవధిలోని 15.485 కోట్ల రూపాయల భారాన్ని పేద మధ్యతరగతి రైతులపై మోపిందని వివరించారు. రైతులు ,పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలపై ఈ విద్యుత్ చార్జీల ప్రభావం ఎంతగానో భారంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రజల పక్షాన ఆలోచన చేసి పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించి పేద మధ్యతరగతి ప్రజలను కరెంటు చార్జీల ఊబిలో నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను తగ్గించని పక్షంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సింగనమల నియోజకవర్గం కార్యదర్శి నారాయణస్వామి, బుక్కరాయసముద్రం మండల సిపిఐ కార్యదర్శి మర్రి స్వామి ,సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు చిన్న తిరుపతయ్య డిహెచ్పిఎస్ నాయకులు రామాంజనేయులు మండల కార్యవర్గ సభ్యులు నాగేంద్ర సుభాన్ నాయకులు ఆనంద్ వెంకట్రాముడు రాము తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు .. సర్దుబాటు చార్జీలు వద్దు

విశాలాంధ్ర-కణేకల్లు: స్మార్టు మీటర్లు పెట్టొద్దు.. సర్దుబాటు చార్జీలు వద్దని సీపీఐ నాయకులు నినదించారు. బుధశారం కనేకల్ విద్యుత్ కార్యాలయం ఎదుట సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎం.గౌస్ పీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఈఆర్సి ఓకే 2023-2024 సర్దుబాటు చార్జీలను తెరపైకి తెచ్చి ఐదు కోట్ల పేద ప్రజల పై భారాన్ని మోపడానికి శ్రీకారం చుడుతున్నారని మండిపడ్డారు. గత జగన్ మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు విద్యుత్ చార్జీలు 9.412 కోట్లు బకాయిలు ఉన్నాయని గత ప్రభుత్వం ఏడుసార్లు చార్జీలు పెంచిందని, అందులో వచ్చిన డబ్బులను నిలబెట్టిన బాకీని కట్టకుండా కేవలం సంక్షేమ పథకాలపై మొగ్గ చూపుతూ మళ్లీ అధికారం పీఠం ఎక్కాలని ఆలోచనతో పేదల నుండి చార్జీలను వసూలు చేసుకుని కట్టాల్సిన బాకీని గాలికి వదిలేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశాడన్నారు. రాష్ట్ర సంపాదనంతా కొల్లగొట్టి వారి ఎమ్మెల్యేలు మంత్రులు ఎంపీలు దోచుకుని తిన్నారన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలపైన సిపిఐ వామపక్షాలతో జగన్ ప్రభుత్వంపైన పోరాటం చేస్తున్నప్పుడు అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు మా ప్రభుత్వం అధికారంలో వస్తే పెంచిన విద్యుత్ చార్జీలు ఉప్పు నుండి పప్పు వరకు నూనె నుండి కాయ కాయగూరల వరకు డీజల్ పెట్రోల్ గ్యాస్ వరకు ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చారన్నారు.

వ్యవసాయ బోర్లకు కేంద్ర ప్రభుత్వం.. మీటర్లు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసినందున అప్పటిలో జగన్ ప్రభుత్వం బోరు బావులకు పంపుసెట్లకు మీటర్లు బిగిస్తుంటే రైతుల మెడలకు ఉరితాడు బిగిస్తున్నారని విరుచుకుపడిన చంద్రబాబు నాయుడు అధికారంలో తర్వాత ఇచ్చిన హామీలను వదిలేసి పాత ప్రభుత్వం పద్ధతిలోనే కొనసాగడం చాలా బాధాకరం అన్నారు. ఐదు కోట్ల నిరుపేదల నుండి విద్యుత్ సర్దుబాటు చార్జీలు వసూలు చేయకూడదని ప్రస్తుత ప్రభుత్వం మొండి వైఖరితో కొనసాగితే అన్ని వామపక్షాలను అన్ని కార్మిక సంఘాలను అన్ని పార్టీలను ఏకతాటిపై వచ్చి ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపైన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనేకల్ మండల సహాయ కార్యదర్శులు ముల్లా, నర్సాప్పలి, ఎస్.బషీర్ అహ్మద్.శాఖ కార్యదర్శి, డి.చందా హుస్సేన్. సిపిఐ కార్యదర్శి బి.హనుమేష్. సబ్ కమిటీ నెంబర్ కాకి జిలాన్, కార్యదర్శి నూర్ భాషా. పాల్గొన్నారు.

వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను తప్పనిసరిగా సవరించాలి

ఎస్టీయు జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి

విశాలాంధ్ర-ఉరవకొండ : పదవ తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికను బలవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, డీఈవో ఉత్తర్వులు ఇవ్వడం సరైనది కాదని ఎస్టియు జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. బుధవారం ఉరవ కొండ మండలంలో మోపిడి, కౌకుంట్ల, రాకెట్ల వై.రాంపురం, ముష్టూరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల నుంచి ఎస్ టి యు సభ్యత్వ స్వీకరణ సమస్యల సేకరణ కార్యక్రమం లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల నుండి సేకరించిన సమాచారం ప్రకారం 10 వ తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికను సబ్జెక్టు నిపుణులతో కానీ ఉపాధ్యాయ సంఘాలతో కానీ సంప్రదించ కుండా ప్రణాళికను బలవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ఎస్సి ఇఆర్టి డైరెక్టర్ డీఈఓ ఉత్తర్వులు ఇవ్వటం సరైనది కాదని తక్షణమే సవరించి, సంక్రాంతి సెలవుల తరవాత రెండవ శనివారాలు, ఆది వారాలు, ప్రభుత్వ సెలవులు మినహాయించి ప్రణాళిక ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెజారిటీ పాఠశాలల్లో సిలబస్ పూర్తి కాలేదు పిల్లలు కూడా మానసికంగా సిద్ధంగా లేరు. అలాగే ఇప్పటివరకు అపార్, హెూలిస్టిక్ కార్డ్స్ తదితర పనులతో ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, సత మత మవుతున్నారు. ఇక నైనా ఉన్నత అధికారులు విద్యార్థులు, ఉపాధ్యాయుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సవ రిస్తే మంచి ఫలితాలు రావడానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. అధి కారులు తీసుకొనే అసంబద్ధ నిర్ణయాలు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు గుదిబండ కాకూడద ని మంచి నిర్ణయాలు ఉంటే మెరుగైన ఫలితాలు రావడానికి అవకాశం ఉంటుం దన్నారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎస్ టి యు రాష్ట్ర కౌన్సిలర్ శివయ్య ఆచారి, మండల సీనియర్ నాయకుడు రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.సురేష్ బాబు పాల్గొన్నారు.

ఈద్గా మసీదు కాంప్లెక్స్ సమస్యను కలెక్టర్ పారదర్శకతతో పరిష్కరించాలి

విశాలాంధ్ర-అనంతపురం : ఈద్గా మసీదు కాంప్లెక్స్ సమస్యను కలెక్టర్ పారదర్శకతతో పరిష్కరించాలని ముస్లిం మైనార్టీ నాయకులు కోరారు. సీపీఐ మైనారిటీ వింగ్ "ఇన్సాఫ్" నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కార్యాలయం లో బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. మైనారిటీ నగర ప్రధాన కార్యదర్శి ఖాజా హుస్సేన్, గౌరవ అధ్యక్షులు అల్లి పీరా, అధ్యక్షులు చాంద్ బాషా మాట్లాడుతూ రోడ్ వైడనింగ్‌లో భాగంగా ఈద్గా మసీదు కాంప్లెక్స్ విషయంలో ఎన్.హెచ్.ఏ వారు తీసుకున్న నిర్ణయం అందరికీ తెలిసినదే అని పేర్కొన్నారు. గతేడాది ఇదే విషయమై మైనారిటీలు అందరూ కలిసి ప్రిన్సిపల్ సెక్రటరీ అనంతపురం విచ్చేసినపుడు ,మసీదు కాంప్లెక్స్ లేని పక్షంలో జరిగే నష్టాలను వారి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. సానుకూలంగా స్పందించి కాంప్లెక్స్ విషయంలో పునరాలోచన చేస్తాను అని మాట ఇచ్చారన్నారు. గత వైకాపా ఎంపీ తలారి రంగయ్యకి కూడా వినతిపత్రం అందజేయడంతో వారు కూడా సానుకూలంగా స్పందించారన్నారు. ఈ విషయమై మంగళవారం నగరంలోని పలువురు మైనారిటీలు, కాంప్లెక్స్‌లోని షాపులో అద్దెకు ఉంటున్న వారు, ముస్లిం సంఘాలు, ఇమాములు ఈద్గా మసీదులో పెద్దఎత్తున చేరుకోవడం జరిగిందన్నారు. అధికారులు మసీదు వద్దకు చేరుకుని పారదర్శకత చూపించకుండా కేవలం ఒకరిద్దరితో చర్చించి వారి మాటే వేదం అనుకుని వెళ్లిపోయారన్నారు.

అక్కడికి తమ ఆలోచనలు, అభ్యర్థనలు వినిపించటానికి వచ్చిన వారితో చర్చలు జరుపలేదన్నారు. ఈ విషయం పై చాలా మంది ముస్లిం నాయకులకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయన్నారు. ఏక పక్ష నిర్ణయాలకు తావు ఇవ్వకుండా అన్ని ముస్లిం సంఘాలకు, అఖిల పక్ష పార్టీల నాయకుల అభిప్రాయాల స్వీకరణ కొరకు ప్రత్యేకంగా కలెక్టర్ చొరవ తీసుకుని ఈద్గా మసీదు కాంప్లెక్స్ విషయంపై నిర్ణయం తీసుకోవావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాజీ వలి, రహంతుల్లా, ఖాజా మొహిద్దీన్, దాదు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాలకు రూ.25వేలు అందజేత

విశాలాంధ్ర-రాప్తాడు : టీడీపీ సభ్యత్వం తీసుకోవడం వల్ల ఓ కుటుంబానికి అండగా ఉన్నవారమవుతామని పార్టీ మండల ఇంఛార్జి ధర్మవరపు మురళీ అన్నారు. తనవంతుగా 250 టీడీపీ సభ్యత్వాలు చేయించేందుకు రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు రూ.25000 నగదును ధర్మవరపు మురళీకి బుధవారం అందజేశారు. రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల ప్రమాదబీమా వర్తిస్తుందన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్ : పట్టణంలో ఆటో డ్రైవర్లకు పట్టణ సీఐ యువరాజ్ బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. పాత బస్టాండ్‌లో ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ ఆటో పరిమితికి మించి అధిక లోడు వేయడం తగదని, తప్పనిసరిగా ఆటో రికార్డులను సరిచూసుకోవాలన్నారు. అతివేగం ప్రమాదాలకు దారితీస్తుందని, మద్యం తాగి ఆటో నడపడం నేరమన్నారు. ఏఎస్ఐ కృష్ణ, హెూంగార్డు మారెప్ప ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వంద శాతం రాయితీతో పశుగ్రాసం

విశాలాంధ్ర-బుక్కరాయసముద్రం : ఉపాధి హామీ పథకం పనుల కింద వంద శాతం సబ్సిడీతో పశుగ్రాసాన్ని అందిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ రత్నకుమార్ రైతులని కోరారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు పశు సంవర్ధక శాఖ సిబ్బంది ప్రతి ఇంటికి తిరిగి పశుగణన చేస్తారని, ఆధార్, ఇంటి డోర్ నెంబర్, ఫోన్ నెంబర్ తప్పకుండా ఇవ్వాలన్నారు. రైతులు 10 సెంట్లు నుంచి 50 సెంట్లు వరకు బహువార్షిక పశుగ్రాసాన్ని పెంచు కోవచ్చు అన్నారు.

రైతులకు సలహాలు, సూచనలు

విశాలాంధ్ర-ఉరవకొండ: లత్తవరం గ్రామంలో మంగళ వారం వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పప్పు సెనగ పంటలో తీసుకోవలసిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారి శుభకర్ అవగాహన కల్పించారు. దిగుబడి ఆధారిత బీమా కంపెనీ రాష్ట్ర మేనేజర్ అరుణ్ జిల్లా మేనేజర్ మూర్తి, వాతావరణ ఆధారిత బీమా కంపెనీ ప్రతినిధి శ్రీనివాస్ రైతులు తక్షణమే పప్పు సెనగ, జొన్న పంటలకు ప్రీమియం చెల్లించాలన్నారు. టమోటా మామిడికి ఈనెల 31వరకు ఉందన్నారు.

రేపటి నుండి రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర- బొమ్మనహాళ్: ఈనెల 6వ తేదీ నేమకల్, 7న కురువల్లి, 9న సిద్ధ రాంపురం, 10న బొమ్మనహాళ్, 11ఉంతకల్, 12న ఉద్దేహాల్ , 13న హరి సముద్రం, 16న బందూరు, 17న కందేపల్లి, 18న బొల్లనగుడ్డం, 19న గోవిందవాడ, 20న దర్గా హెూన్నూర్, 21న శ్రీధర గట్టు, 23న సింగేపల్లి 24 కో లగనహళ్లి 26న ఏ లంజి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తాహసిల్దార్ మునివేలు అన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణే ధ్యేయంగా పోలీసుల చర్యలు

- ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు
- రూ. 30,200 నగదు స్వాధీనం..
- ఎస్పీ పి.జగదీష్

విశాలాంధ్ర-అనంతపురం : ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణే ధ్యేయం గా చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా.. ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లు... ఇలా ప్రతీ వాహనాన్ని చెక్ చేశారు. గడచిన 24 గంటల్లో ఉల్లంఘనలపై 1,276 ఎం.వి కేసుల నమోదు చేసి రూ. 3,12,620/- ఫైన్లు వేశారు. ఓపెన్ డ్రింకింగ్ కేసులు 67, డ్రంకన్ డ్రైవ్ కేసులు 18 ... ఏటిఎంల భద్రతలో భాగంగా 173 ఏటిఎం సెంటర్స్‌ను తనిఖీ చేశారు. అదేవిధం గా అనంత పురం వన్ టౌన్ పోలీసులు ఏడుగురు పేకాట రాయుళ్లను అరెస్టుచేసి రూ.30,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగితే డయల్ - 100/112 లేదా సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

భావితరాలకు బాసటగా నిలిచాలి

జిల్లా పరిషత్ చైర్మన్ గిరిజమ్మ

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ: భావితరాలకు బాసటగా నిలిచేలా ఆవిష్కరణలు చేపట్టాలని జిల్లా పరిషత్ చైర్మన్ గిరిజమ్మ పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ప్రిన్సిపల్ సి.జయచంద్ర రెడ్డి అధ్యక్షతన పాలిటెక్ ఫెస్ట్ 2024 ఆవిష్కరణలు చేపట్టారు. విద్యార్థులు పరిశోదాత్మక ఆవిష్కరణలు అందరినీ అలరించాయి. సాంకేతిక విద్యాశాఖ డిప్యూటీ సెక్రటరీ వేణు యాదవ్, ఎస్ వి యు రీజనల్ ఆర్జెడి నిర్మల్ కుమార్ మాట్లాడుతూ.. సమాజంలో ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషణ చేపడుతూ సమాజ అభ్యున్నతకు తోడ్పాటున ఇచ్చేలా చేపట్టారు అన్నారు. ప్రిన్సిపల్ సి. జయచంద్ర రెడ్డి మాట్లాడుతూ.. వినూత్న, పారిశ్రామిక పురోగతి, ఆర్థిక వృద్ధికి చేయూతనిచ్చేలా.. విద్యార్థుల మేథో వికాస ప్రగతికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ కుమార్, ప్రభుత్వ ప్రైవేటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జావిద్ ఖాద్రివి అసత్య ఆరోపణలు

విశాలాంధ్ర-తాడిపత్రి: వైసీపీ పట్టణ అధ్యక్షుడు జావిద్ ఖాద్రి ఆరోపణలు అసత్యమని తెలుగుదేశం నాయకులు గోరా భాయ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న తెలుగుదేశం నాయకులు గోరా భాయ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ పట్టణ అధ్యక్షుడు జావిద్ ఖాద్రి తనకు దాదాపు పది నెలల కిందట వ్యాపార లావాదేవీలలో రూ.75 లక్షలు బాకీ పడ్డాడని, అప్పటినుండి ఎప్పుడు ఫోన్ చేసినా డబ్బులు ఇస్తాను లే అని చెప్పుకుంటూ వచ్చి ఈరోజు తన దగ్గర డబ్బులు లేవు, నేను బాకీ లేను అని వీడియోలు రిలీజ్ చేయడం భావ్యమేనా అన్నారు. తాను వ్యాపార నిమిత్తం తెలుగుదేశం నుండి వైసిపిలోకి వచ్చానని, తర్వాత వైసిపి పార్టీ నుండి తెలుగుదేశం పార్టీలోకి పోయి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాననన్నారు. అయ్యా జావిద్ ఖాద్రి నేను జేసీ ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు ఆయన దయతో 16 లారీలను దాదాపు నూరు లారీలుగా అభివృద్ధి చెందాను. వైసిపి పార్టీలోకి వచ్చినప్పుడు నూర్ లారీలు ఉన్నాయి. నేను వైసీపీ నుండి తెలుగుదేశం పార్టీలోకి వచ్చినప్పుడు 40 లారీలు మిగులుతోనే వచ్చాను. కానీ నీ మాదిరిగా డబ్బులు బాకీ ఉన్నప్పటికీ బాకీ లేను అని చెప్పి తమకు వాట్సాప్ కాల్ చేసి బెదిరిస్తున్నావు. నువ్వు నీ కుటుంబకీలతో వచ్చి నేను నా కుటుంబీకులతో వచ్చి లెక్కచారం చేసుకోవచ్చు.. వాట్సాప్ కాల్ చేసి బెదిరింపులకు దిగజారదు అన్నారు. ఎస్పీ మాకు న్యాయం చేయాలని కోరారు.

నకిలీ పట్టాలతో పేదలను మోసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

- సిపిఐ నగర కార్యదర్శి ఎన్.శ్రీరాములు

విశాలాంధ్ర-అనంతపురం: ఉప్పరపల్లి పొలం 194-8, 215 సర్వే నంబర్ ఇంటి పట్టాలిప్పిస్తా మనీ, నకిలి పట్టాలు సృష్టించి ఏకంగా తాసిల్దార్ సంతాకాలు సీల్ లను ముద్రించి పేద ప్రజలను నిలువునా మోసగించిన కురుగంట గ్రామానికి చెందిన ఎస్.నాగభూషణం, ఈడిగ వెంకటేషలను తక్షణం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ, ఈ రోజు అనంతపురము రూరల్ తాసిల్దార్ కార్యాలయం నందు బాధిత ప్రజల తరుపున సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు, నకిల పట్టలు మంజూరు చేసిన మోసగాళ్ళను శిక్షించాలి ... అరెస్ట్ చేయాలి... పెద ప్రజలకు న్యాయం చేయాలి.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి ఎన్.శ్రీరాములు మాట్లాడుతూ.. ఉప్పరపల్లి పోలంలో ఇంటి పట్టాలు ఇప్పిస్తామని దాదాపు. 200 మంది పేదలతో వేలు డబ్బులు వసూలు చేసిన ఎస్.నాగభూషణం ఈడిగ వెంకటేశులపై గతంలోనూ అనేక మంది ప్రజలు రెవిన్యూ అధికారులకు పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. పత్రికల్లో పెద్ద ఎత్తున కథనాలు వచ్చాయని గుర్తు చేశారు.చివరికి తాసిల్దార్ సంతకం, దానికి సంబంధించిన సీల్ సైతం ఫోర్జిని చేసి నకిలీ పట్టాలు తయారుచేసి వాటిని డబ్బులు అమ్ముకున్నారని గతంలో ఎమ్మార్వో మోహన్‌కి నకిలీ పట్టాల ఫోర్జరీపై పోలీసులు ఫిర్యాదు చేశారని అయినా ఇంతవరకు వారిపై చర్యలు తీసుకోక పోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది అన్నారు. సిపిఐ నాయకులు శ్రమించి రామాంజనేయులుకి లక్ష 15 వేలు శివాకి రూ.35000 భాషకి రూ.40 వేలు, షేక్ష రూ.21 వేలు, కిషోర్‌కి రూ.14,500, జయంతికి రూ.25 వేల వరకు మేరా నాగభూషణంతో ఇప్పించామని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు పోలీసు అధికారులు ఇలాంటి వారిపై కఠినం చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో బాధితులు పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. అనంతరం రూరల్ ఎంఆర్ఓ సీనియర్ అసిస్టెంట్ యోగేంధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి రమణ సంతోష్ సిపిఐ నగర్ కార్యవర్గ సభ్యులు ప్రసాద్ సుందర్రాజు జయలక్ష్మి చాంద్ భాషా మున్నా ఇన్సాఫ్ నగర కార్యదర్శి ఖజా బాధితులు పాల్గొన్నారు.

వేములపాడు బాధితులను పరామర్శించిన సిపిఐ నాయకులు

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని వేములపాడు గ్రామంలో సోమవారం జరిగిన దాడిలో గాయపడిన పెద్ద పుల్లారెడ్డి, చిన్న పుల్లారెడ్డి అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని బుధవారం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు చిన్నప్ప యాదవ్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకట రాముడు యాదవ్, యాడికి సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ, తాడిపత్రి రైతు సంఘం నియోజక వర్గ కార్యదర్శి ఓబిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణం ఉన్న గ్రామంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలో రోడ్డు విస్తరణలో పనుల్లో భాగంగా దాడులు చేయడం దుర్మార్గమన్నారు. ఈ ఘటనపై భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా సమితి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిపై కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పోలీసు భద్రతలో రైల్వే సంఘాల ఎన్నికలు..

విశాలాంధ్ర-గుత్తి : ఆర్ఎస్‌లోని రైల్వే ఇన్స్టిట్యూట్లో రైల్వే సంఘాల గుర్తింపు ఎన్నికలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ ఎన్నికలు నేటి నుంచి మూడు రోజులపాటు అనగా 4,5,6 తేదీలలో జరుగుతాయని రైల్వే కార్మికులు తెలిపారు. ఎన్నికల జరిగే ప్రాంతం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగ కుండా జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పోలింగ్ ప్రశాంతంగా జరుగుతున్నట్లు రైల్వే కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ఎస్కేయూ హాకీ జట్టుకు సనప విద్యార్థి ఎంపిక ..

విశాలాంధ్ర-ఆత్మకూరు : డిసెంబర్ 13 నుండి చెన్నైలో జరగనున్న దక్షిణాది రాష్ట్రాల యూనివర్సిటీ హాకీ పోటీలలో పాల్గొనే శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ జట్టుకు సనప గ్రామానికి చెందిన ఎం.రాము ఎంపిక య్యాడు. సనప హైస్కూలులో చదివే రోజులలో హాకీ పట్ల ప్రేమాభిమానాలు కనబరిచి బాగా రాణించేవాడని పిడి తెలిపారు. ప్రస్తుతం ఈ క్రీడాకారుడు అనంతపురం వివేకానంద డిగ్రీ కాలేజీలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. రాము ఎంపిక పట్ల ఫిజికల్ డైరెక్టర్ గట్టు నాగరాజు, గ్రామ పెద్దలు ఆకుమలనాగరాజు ,నరసింహులు అభినందించారు.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీకి ఎంపిక

విశాలాంధ్ర-శెట్టూరు : ఇటీవల చిత్తూరు జిల్లా పూతల పట్టులో జరిగిన 68వ రాష్ట్రస్థాయి త్రో బాల్ క్రీడా పోటీలో చెర్లోపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.కరిష్మా ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికైంది. బుధవారం విద్యార్థిని పాఠశాల హెచ్ఎం శిరీష, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, తలారికృష్ణ ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్య

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : కంబదూరు గ్రామ పంచా యతీ కార్యదర్శి రాఘవేంద్ర బుధవారం తెల్లవారు జామున పంచాయతీ సచివాలయంలోని గదిలో ఫ్యాన్‌కి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కంబదూరు పంచాయతీతో పాటు మరో రెండు పంచాయతీలు కూడా రాఘవేంద్రకు అదనపు బాధ్యతలు ఇచ్చినట్టు తెలుస్తోంది. స్వగ్రామం రాయదుర్గం కాగా మంగళవారం రాత్రి సచివాలయంలోనే నిద్రించినట్లు సమాచారం. రాత్రి పొద్దు పోయాక ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. కంబదూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి మృతితో మండలంలోని రెవెన్యూ సిబ్బంది విషాదంలో మునిగారు. కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి వచ్చి బోరున విలపించారు.

శనగపప్పు వ్యాపారుల ఐపిపై విచారణ

విశాలాంధ్ర-కణేకల్లు: రెండేళ్ల క్రితం కనేకల్ మండల వ్యాప్తంగా శనగ వ్యాపారులు రైతుల వద్ద శనిగపప్పును కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా ఐపీ పెట్టిన కేసును ఎట్టకేలకు పోలీసులు బుధవారం విచారణ చేపట్టారు. రాయదుర్గం సిఐ వెంకటరమణ కనేకల్ పోలీస్ స్టేషన్లో ఫైళ్లను తెప్పించుకుని విచారణ చేపట్టారు. సిఐ వెంకటరమణ మాట్లాడుతూ కనేకల్ మండల వ్యాప్తంగా శనగపప్పు పండించే రైతులు అధికంగా ఉన్నారని, గతంలో మాల్యం సోల్లాపురం తదితర గ్రామాల్లో సెనగపప్పు వ్యాపారులు రైతుల వద్ద నుండి అప్పుగా తీసుకుని కొనుగోలు చేసి కోట్ల రూపాయలు దండుకొని ఐపి పెట్టి నట్టేట ముంచారన్నారు. రైతులకు న్యాయం చేస్తామన్నారు.

మామిడి తోటలపై అవగాహన

విశాలాంధ్ర-బెలుగుప్ప : మామిడి తోటలపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఉద్యాన అధికారి కృష్ణ తేజ అన్నారు. డిసెంబర్‌లో పువ్వు మొగ్గలు ఏర్పడతాయని పూత మొగ్గ రావడానికి 0.52.34 మందును మూడు గ్రాములు, సూపర్ కాన్పిడర్ 0.5ఎంఎల్, ఆగ్రోమిన్ మాక్స్ 3జిఎం, భావిష్టిన్ 1జిఎం చొప్పున లీటర్ నీటి కలిపి పిచికారి చేయాలన్నారు, మందులు పిచికారి చేసిన పూత రాకపోతే డిసెంబర్ 15 తర్వాత డబుల్ వన్ ఎం.ఎల్, విపుల్ 3ఎంఎల్ కలిపి పిచికారి చేసుకోవాలి అన్నారు.. లేదంటే పది లీటర్ల నీటికి ప్లానోఫిక్స్ 3ఎంఎల్ సైటో జైమ్ 20 ఎంఎల్ కలిపి పిచికారి చేయాలన్నారు. బూడిద తెగులు, తేనెమంచు పురుగు వ్యాపిస్త తుంటాయి, రెండిటినీ సమర్థవంతంగా కంట్రోల్ చేసుకోవడానికి 1.5 గ్రా. ఏసిఫేటే 2.5 గ్రా. మ్యాన్కొజెబ్ లేదా 0.4 మి.లి. ఇమిడక్లోప్రిడ్ ం 1 గ్రా. కార్బండిజం / 1 మి.లి డైఫెన్కోనోజోల్ ఏదైనా ఒకటి లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకున్నట్లైతే సమర్థవంతంగా నివారించుకోవచ్చు అన్నారు

యాడికి కాలువను పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-యాడికి: తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి యాడికి కాలువను బుధవారం పరిశీలించారు. కదరగుట్టపల్లి హెడ్ రెగ్యులేటర్ వద్ద యాడికి కాలువ నుండి వచ్చు నీటిని పరిశీలించారు. కదరగుట్టపల్లి నుండి రాయలచెరువు వరకు యాడికి కాలువలో కంపచెట్లు పెరిగి నీటిపారుదలకు ఆటంకంగా ఉండడంతో రెండు మూడు రోజులలో కంపచెట్లు తొలగించి యాడికి కాలువకు నీళ్లు వదలాలని భావిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం చందన వరకు యాడికి కాలువ వెంట వెళ్లి పరిశీలించి కాలువలో పెరిగిన కంప చెట్లను వెంటనే తొలగించాలని స్థానిక నాయకులను ఆదేశించారు. ఆయన వెంట కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, పరిమి చరణ్, హరి ,రవి కుమార్ రెడ్డి, నాగమణి రెడ్డి, రామచంద్రారెడ్డి, అమిలినేని సత్య పాల్గొన్నారు.

మెడిసిన్ సీటు రాలేదని ఆత్మహత్య



విశాలాంధ్ర-రాయదుర్గం టౌన్: రాయదుర్గం పట్టణ శివారులోని పై తోట సమీపంలో రైలు నుండి దూకి డాక్టర్ కావాల్సి తనుజ అనే యువతి ఆత్మహత్యకు పాల్పడింది. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా జిల్లా సేడం పట్టణానికి చెందిన తనుజ ఇటీవల డాక్టర్ కోర్స్ కోసం పరీక్షలు రాసింది. సీటు రాకపోవడంతో రెండు రోజుల కిందట తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలిపింది. హెూస్పేట నుండి బెంగళూరుకు వెళ్తున్న ట్రైన్‌లో ప్రయాణిస్తూ రాయదుర్గం పట్టణ శివారు ప్రాంతాల్లోని పైతోట వద్ద రైలు నుండి దూకి అఘాత్యానికి పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం ఉదయం నగేష్ విధులు నిర్వహిస్తూ శవమై పడిన తనుజ వివరాలు స్థానిక రైల్వే స్టేషన్‌కు సమాచారం అందించారు. తల్లిదండ్రులు తమ కూతురే తనూజ అని నిర్ధారించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై శిక్షణ

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: సాగునీటి ఎన్నికలు వస్తున్నా నేపధ్యంలో మండల కేంద్రంలోని వెలుగు కార్యలయంలో బుధవారం బొమ్మనహాళ్ తహశీల్దార్ మునివేలు పిఓ, ఏపిఓలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. సాగునీటి ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. 7 సాగునీటి సంఘాలు, ఒకటి చెరువు సంఘం ఎన్నికలు జరుగుతయని ఒక్కొ సంఘంలో 12 మందిని టిసి సభ్యులు, చెరువు సంఘంలో 6 మంది టిసి సభ్యులు ఎన్నిక జరుగుతుం దన్నారు. 7 సాగునీటి సంఘంలో 14486 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని చెప్పారు. సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ప్రశాంతమైన వాతవరణంలో సమర్థవంతంగా నిర్వహిచాలన్నారు. ఈ కార్యక్రమంలో జెఈఈ అల్తాఫ్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 5, డిసెంబర్ 2024

తాగునీటి కోసం రోడ్కెక్కిన మహిళలు

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే తాగునీటి సమస్య

విశాలాంధ్ర-గుడిబండ: మండలంలోని శంకరగల్లు గ్రామంలోని దొరగారి వీధిలో దాదాపు 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గత మూడు నెలలుగా తాగునీటి సమస్య నెలకొందని గ్రామంలోని మహిళలు కాలి బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే శంకరగల్లు గ్రామ పంచాయతీకి చెందిన బోరులో పుష్కలంగా నీళ్లు ఉన్నాయని విద్యుత్ అధికారులు ట్రాన్స్ఫర్ ఏర్పాటు చేయలేక గత మూడు నెలలుగా తాగునీటి ఎదుటి ఎదుర్కొంటున్నామని. గ్రామ పంచాయతీకి సంబంధించిన బోరుబావికి అదే గ్రామానికి చెందిన పిల్లే రంగప్ప రైతుకు చెందిన 25 కె.వి.ట్రాన్సుఫార్మర్ నుండి రైతుకు చెందిన రెండు బోర్లతో పాటు గ్రామపంచాయతీ కి చెందిన ట్రాన్సుఫార్మర్ నుండి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం వల్ల విద్యుత్ అధిక లోడ్ కారణంగా గ్రామ పంచాయతీకి చెందిన స్టార్టర్ మోటర్ కాలిపోతుందని పేర్కొన్నారు. ఈ విషయంపై విశాలాంధ్ర ప్రతినిధి సర్పంచ్ జయమ్మ పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి లను వివరణ కోరగా ఇప్పటికే విద్యు త్ ట్రాన్స్ఫారం కోసం దరఖాస్తు చేసుకున్నామని విద్యుత్ ట్రాన్సుఫార్మర్ మంజూరు అయితే గ్రామపంచాయతీ బోరు బావికి బిగిస్తే తాగునీటి సమస్య తలెత్తకుండా ఉంటుందని తెలిపారు. ఈ క్రమంలో గుడిబండ మండల విద్యుత్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ పోస్ట్ ఖాళీగా ఉండడం ఇన్చార్జిగా ఏఈగా అమరాపురం సిద్దేశ్వరులు విధులు నిర్వహిస్తున్న పూర్తిస్థాయిలో రైతులకు గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ సమస్యలు పరిష్కరించడంలో విఫలమవుతున్నట్లు సమాచారం. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని తాగునీటి సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో 8వ 9వ వార్డు మెంబర్లు అరుణ్ కుమార్, తిమ్మక్క, నాగమ్మ, జ్యోతి, లక్ష్మక్క, రంగమ్మ, చెన్నరాయప్ప, విజయ్‌కుమార్ శ్రీరామప్ప నాగేంద్ర పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బీజేపీ నాయకుడు

విశాలాంధ్ర-ధర్మవరం : విజయవాడలోని ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవును బుధవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు ధర్మవరం పట్టణ బిజెపి నాయకుడు డోలా రాజారెడ్డి తెలిపారు. అనంతరం నియోజకవర్గ మండల ప్రజల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

డోల రాజారెడ్డి ఇప్పటికే పట్టణంలో పలు సేవా కార్యక్రమాల్లో మంచి గుర్తింపు ప్రజల వద్ద పొందడం జరిగింది. అంతేకాకుండా గత 18 రోజులుగా పట్టణంలో పతిరోజు 900 పైగా మాలాధారణ భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టిన డోల రాజారెడ్డిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై 9,10న రాష్ట్రవ్యాప్త నిరసనలు జయప్రదం చేద్దాం

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్

విశాలాంధ్ర-కదిరి : కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఈనెల 9,10న మండల వ్యాప్తంగా నిరసనలు జయ ప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్ పిలుపు నిచ్చారు. బుధవారం ఆయన స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదాని గ్రూపు కంపెనీల అవినీతి తప్పిదాల అశ్రిత పక్షపాత ధోరణిని ప్రోత్సహించడంలో కేంద్ర ప్రభుత్వ పాత్రపై దర్యాప్తు చేయాలని అందుకోసం సంయుక్త పార్లమెం టరీ కమిటీ ఏర్పాటు చేయాలని, మణిపూర్‌లో హింసాత్మక పరిస్థితులపై పార్లమెంటులో చర్చించాలని, సాయుధ బలగాల ప్రత్యేక రక్షణ చట్టం ఉపసంహరించుకోవాలన్నారు. అధిక ధరలు అరికట్టాలని, నిరుద్యోగాన్ని నిర్మూలించాలని 10న డిమాండ్స్ డే పాటించాలని సీపీఐ జాతీయ సమితి పిలుపు నిచ్చినట్లు తెలిపారు. అమెరికా లోని న్యూయార్క్ ఈస్టన్ డిస్టిక్ కోర్టులో అదానిపై అవినీతి కేసు నమోదు అయిందన్నారు. విద్యుత్ ఒప్పందాల కోసం అదానీ నాలుగు రాష్ట్రాలలో దాదాపు రూ. 2100 కోట్ల ముడుపులు ఇచ్చినట్టు ఆరోపణలు ఉన్నాయన్నారు. అత్యధిక భాగం రూ. 1750 కోట్లు ఆంధ్రప్రదేశ్ గత ప్రభుత్వం హయాంలో ముడుపులుగా ముట్ట చెప్పినట్లు తెలుస్తుందన్నారు. ఫలితంగా 25 సంవత్సరాల పాటు రాష్ట్ర ప్రజలపై రూ. 1,10 కోట్ల మేర విద్యుత్ చార్జీల భారం పడుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో అదాని అవినీతి కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలని, గత ప్రభుత్వ హయాంలో అదాని చేసుకున్న అన్ని ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణం అదానిని అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మధునాయక్, పట్టణ కార్యదర్శి లియాకత్, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మధునాయక్, ఆదెప్ప,ఈశ్వరయ్య, చౌడప్ప ఎల్ వి రమణ పాల్గొన్నారు.

పిల్లల దృష్టి లోపాన్ని గుర్తించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: పిల్లలు దృష్టి లోపాల్ని తల్లిదండ్రులు గుర్తించినప్పుడే కంటి వెలుగు సంపూర్ణంగా ఉంటుందని కంటి వైద్య నిపుణులు, రిటైర్డ్ జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ నరసింహులు అన్నారు. బుధవారం మాట్లాడుతూ తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సమిష్టిగా విద్యార్థులలోని దృష్టి లోపాన్ని గుర్తించి కంటి డాక్టర్ సలహాతో సరియైన కంటి అద్దాలను ఉపయోగిస్తే వారిలోని దృష్టిలోపాలను పరిష్కరించ వచ్చునని తెలిపారు. కంటి రక్షణపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. విద్యార్థులు చదువులో బాగా రాణించాలంటే చక్కటి కంటిచూపు ఎంతైనా అవసరం అన్నారు. చాలామంది కుటుంబంలోని పిల్లలు తమ కంటి చూపును సమస్యను చెప్పకుండా బాధపడుతుంటారని, తల్లిదండ్రులు కంటి విషయంపై జాగ్రత్త వహిస్తే సమస్యలు ఉండవని తెలిపారు. పిల్లలను టీవీతో పాటు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలని తెలిపారు. ఎందుకంటే పరోక్షంగా చదువులో కూడా వెనుకబడే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి పాఠశాలలో కంటిచూపు పట్టికను ఏర్పాటు చేస్తే విద్యార్థులే స్వయంగా దృష్టిలోపాలను కనుగొంటారని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, యాజమాన్యం, తల్లిదండ్రులు సమిష్టిగా కృషి చేసినప్పుడే ప్రతి విద్యార్థికి కంటి చూపు లభిస్తుందని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు.

కొణిజేటి రోశయ్య లేని లోటు తీర్చలేనిది

విశాలాంధ్ర-ధర్మవరం: ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో కొణి జేటి రోశయ్య లేనిలోటు తీర్చలేనిదని ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర పొలిటికల్ చైర్మన్ పెనుజూరు నాగరాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని పెనుజూరు నాగరాజు కార్యాలయంలో కొణిజేటి రోశయ్య మూడవ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘం, జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం, పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో రోశయ్య తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్నారన్నారు 50 ఏళ్ల తన రాజకీయ జీవితంలో రోశయ్య తమిళనాడు గవర్నర్‌గా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, ఆర్థికశాఖ మంత్రిగా, శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా ఇలా ఎన్నో పదవులను అలంకరించడంతో పాటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కీలక పాత్ర వహించారన్నారు. అలాంటి మహనీయుని అడుగు జాడల్లో ప్రతిఒక్కరు నడవాలన్నారు. ప్రత్యేకించి ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరించడంలో పెద్దన్న పాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు ఆర్వేటి కిషోర్, కర్ణాటకం ముకుంద, రాష్ట్ర ఆర్యవైశ్య యువ జన సంఘం మీడియా కమిటీ సభ్యులు గ్రంధే శ్రీనివాసులు, సత్యసాయి జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు కలవల నాగతేజ, పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు దేవతా శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు అంబటి అవినాష్, పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కాకతీయ విద్యా నికేతన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత ట్రాఫిక్ నియమాలపై అవగాహన కోసం బుధవారం దృశ్యాత్మక కార్యక్రమాలను నిర్వహించామని, పాఠశాల కరస్పాండెంట్ నిర్మల జయచంద్ర రెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రోడ్డుపై నడిచేటప్పుడు, వాహనాలు నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించడం వలన జరిగే ప్రమాదాలు, హెల్మెట్ వాడకం వలన జరగబోయే ప్రమాదాలను ఎలా అరికట్టవచ్చో విద్యార్థులకు వివరించారు. ట్రాఫిక్ నియమాలకు సంబంధించిన గుర్తుల గురించి వివరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ గురించి కళ్లకు కట్టినట్లు చూపించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సూర్య ప్రకాష్ రెడ్డి, పద్మ, ఉపాధ్యాయ, బోధనేతర బృందం, పాల్గొన్నారు.

11న డీ.ఈ.ఓ. కార్యాలయాల ఎదుట నిరసన

విశాలాంధ్ర-ధర్మవరం: విద్యాశాఖ అధికారుల అసమ్మద్ధ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈనెల 11న డీఈఓ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు బుధవారం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి సుధాకర్‌లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్మవరంలోని ఉప విద్యాశాఖధికారిని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కలిశామన్నారు. గత ప్రభుత్వ పరిపాలనకు, ఈ ప్రభుత్వ పరిపాలనకు పెద్దగా తేడా లేదని ఆరోపించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆమిదాలగొందిలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు జాబేజ్ సస్పెండ్, పాఠశాలల పని వేళలను 5 గంటల వరకూ పెంపు విషయం, పదో తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ గాని, కొన్ని మండలాల్లో 10 శాతం నుంచి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదని మండల విద్యాశాఖ అధికారులు అత్యవసర సందర్భాల్లో కూడా సెలవులు మంజూరు చేయడం లేదని మండిపడ్డారు. అనారోగ్యం పడిన వారికి సైతం సెలవులు మంజూరు చేయకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇప్పటికే విద్యార్థుల అపార్ నమోదు విషయంలో ఉపాధ్యాయులు పలు ఇబ్బందులు పడుతున్నారని, దీని వల్ల బోధనకు ఆటంకం కలుగుతున్నది అని వాపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో ఆదివారాలు, విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని డిమాండ్‌తో ఈనెల 11వ తేదీ కొత్తచెరువు జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శనలు ఈనెల 16వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు. రాతపూర్వక నోటీసును డీఈవో కిష్టప్పకు అందజేస్తామన్నారు. ఒత్తడి లేని వాతావరణంలో ఉపాధ్యాయులు స్వేచ్ఛగా పనిచేసే విధంగా అధికారులు నిర్ణయాలు ఉండాలని, లేని యెడల పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మేరీ వర కుమారి, జిల్లా కార్యదర్శి లతా దేవి, నాయకులు రామకృష్ణ నాయక్, హరికృష్ణ, లక్ష్మయ్య, రాం ప్రసాద్, రామాంజనేయులు సాయి గణేష్, బిల్లే రామాంజనేయులు, హరిశంకర్, వెంకట కిషోర్, బాలగుండ్ల ఆంజనేయులు, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

జలశుద్ధి యంత్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే..

విశాలాంధ్ర-తలుపుల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటుచేసిన జలశుద్ధి యంత్రాన్ని బుధవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. ఎమ్మెల్యే ముందుగా విద్యార్థులకు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులను ఆప్యాయంగా పలకరిస్తూ బాగా చదువుకోవాలని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరన్న స్కూల్ కమిటీ చైర్మన్ ఎద్దుల రాముడు ఎమ్మెల్యేకి పూలమాలవేసి దశావతో సన్మానించారు.

నీటి ప్రవాహంలో చిక్కుకున్న 60 గొర్రెలను కాపాడిన పోలీసులు

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల మండలంలో కురిసిన వర్షానికి పెద్ద ఎత్తున చిత్రావతి నది వర్షపు నీటితో పరవళ్ళు తొక్కుతూ ప్రవహించింది. ఆ సమీప ప్రాంతంలో గల మండలంలోని ఖాజాపురం వద్ద గల చిత్రావతి నదిలో గొర్రెలు కాపారులు తమ 100 గొర్రెలను నది దాటిస్తుండగా 60 గొర్రెలు నది మధ్యలో వున్న బండ పై నిలిచిపోయాయి, దీంతో ఆందోళన చెందిన కాపరులు డయల్ 100 కు ఫోన్ చేయగా వెంటనే గోరంట్ల అప్ గ్రేడ్, సీఐ శేఖర్, ఎస్సైలు బాబు, శ్రీనివాసులు సిబ్బంది వేణుగోపాల్ రెడ్డి, రమేష్,వెంకటేష్,నరసింహ లు గ్రామ ప్రజలతో కలిసి 60 గొర్రెలను చిత్రావతి నది మధ్యలోంచి కాపాడి బయటకి తీసుకువచ్చారు. డయల్ 100 కాల్‌తో వెంటనే స్పందించిన పోలీసులను ఎస్పీ వి.రత్న ఐపీఎస్ అభినందించారు.

ఖాళీ బిందెలతో మహిళల ధర్నా

విశాలాంధ్ర-అగళి : స్థానిక ఎస్సీ కాలనీలో నెలకొన్న త్రాగునీటి సమస్యను తీర్చాలని బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టారు. ఎగువ కాలనీకి త్రాగు నీరు వస్తున్నాయని దిగువ ప్రాంతంలో ఉన్న ఇళ్లకు గత మూడు నెలల నుంచి నీళ్ళు రావడం లేదని, తెలిపారు. పైప్‌లైన్ అస్తవ్యస్తంగా కారణంగా తమకు నీరు రావడంలేదని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

దాడితోటలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం

విశాలాంధ్ర తాడిమర్రి : మండలంలోని దాడితోట గ్రామంలో బుధ వారం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, గర్భిణులు, చిన్న పిల్లలు వ్యాక్సిన్ గురించి వివరించారు. కార్యక్రమానికి ధర్మవరం డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సిల్వియా సల్మాన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోవర్ధన్ నాయుడు ఎంఎల్ హెచ్ పి శ్రీ ధరణి ఏఎన్ఎం బాలరాణి ఆశ వర్కర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ మాట్లాడుతూ గ్రామ పరిసర ప్రాంతాల్లో మురికి కాలువలు నీటి కుంటలు చెత్త దిబ్బలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని లేదంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో వైరల్ ఫీవర్ జలుబు దగ్గు వంటివి వ్యాపించే అవకాశం ఉందన్నారు. వీలైనంతవరకు ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలు పరిశుభ్రత ఉండేలా చేసుకోవాలని సూచించారు

150 మందికి ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-రొళ్ల: స్థానిక లక్ష్మీ ప్యాలెస్‌లో మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 150మంది రోగులు హాజరవ్వగా శ్రీ చక్ర హాస్పిటల్ కర్నూలుకు చెందిన ఆసుపత్రి వైద్యులు డాక్టర్.విజయ్ కుమార్ రెడ్డి,డాక్టర్,షఫీ.ప్రదీప్ ప్రసాద్ వర్మ రోగులకు ఉచిత వైద్య చికిత్సలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఉచితంగా గుండె జబ్బులు న్యూరో సర్జరీ కిడ్నీ స్టోన్ తదితర పరీక్షలు నిర్వహించారు. 20 మంది రోగులను గుర్తించి వీరిని మెరుగైన వైద్య చికిత్సల కోసం కర్నూలు శ్రీ చక్ర ఆసుపత్రికి రెఫర్ చేశారు అవసరమైన రోగులకు ఉచితంగా మందులు ఆపరేషన్లు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు దాసిరెడ్డి లక్ష్మీనారాయణ, టీడీపీ టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర కార్యదర్శి బి.యస్ గురుమూర్తి,తెదేపా మండల ప్రధాన కార్యదర్శి జి.కే ఈరన్న,మాజీ జెడ్పిటిసి నన్నతిమప్ప, నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి మురళి ఇంగ్లీష్ మీడియం స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ యోగానంద్ పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-పెనుకొండ: ప్రభుత్వ కళాశాలల సంఘం అధ్యక్షుడిగా డా కె.జయప్ప ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెనుకొండ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ఎన్నికలు పెనుకొండలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి డా.రాజశేఖర్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల అనంతపురం సమక్షంలో జరిగాయి. డా.నాయక్ అనిల్ కుమార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మడకశిర, కార్యదర్శిగా, సి.సుమంగళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, హిందూపురం కోశాధికారిగా డా.కృష్ణనాయక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కదిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పరవేక్ష కుడిగా అనంతపురం ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డా.శ్రీధర్ కోనంకి పాల్గొన్నారు. అధ్యాపకులు శ్రీలక్ష్మి, హరిప్రసాద్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, నాగమణి, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు 'గ్రీవెన్స్ డే"

మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్ బాబు

విశాలాంధ్ర-ముదిగుబ్బ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సచివాలయ సిబ్బందితో కలిసి "గ్రీవెన్స్ డే" కార్యక్రమం మంత్రి కార్యాలయ సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు మాట్లాడుతూ, "గ్రీవెన్స్ డే" ద్వారా గ్రామాల నుండి సచివాలయానికి వచ్చిన ప్రజలు తమ సమస్యలను సత్వరంగా పరిష్కరించుకోగలుగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా స్థానిక ప్రజలకు ప్రభుత్వ శాఖల సేవలు త్వరితంగా అందించబడుతున్నాయని, వారి సమస్యలను నేరుగా సచివాలయంలో ఉన్న అధికారులతో పరిష్కరించడం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ప్రజల నుండి వచ్చిన అభ్యర్థనలు మరియు వినతులను అత్యంత ప్రాముఖ్యంగా పరిగణించామని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. అలాగే, ప్రతి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని హరీష్ బాబు తెలిపారు.

గ్రీవెన్స్ కార్యక్రమం అనంతరం హరీష్‌బాబు ముదిగుబ్బ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, బాలికల బీసీ హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించి, అనేక అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా విద్యా వనరులు, విద్యార్థులకు ఉన్న అనేక సమస్యలపై చర్చిం చారు. ప్రత్యేకంగా నీటి సరఫరా సమస్యలను గురించి ఆయన దృష్టికి తీసుకు రావడంతో, ఆ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. తదనం తరం, ఎంఈఓ ఉపాధ్యాయ సిబ్బంది మరికొన్ని సమస్య లను ప్రస్తావించగా, ఆయన వాటిని దృష్టిలో ఉంచుకొని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ముదిగుబ్బ మండల అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో హిందూపురం అగ్రస్థానం

- రాష్ట్రంలో రాప్తాడు 14వ స్థానం
- వెంకటాపురంలో పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ సమక్షంలో సంబరాలు

విశాలాంధ్ర-రామగిరి: టీడీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదులో హిందూపురం పార్లమెంట్ రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవడంతోపాటు జోన్-5 పరిధిలో 3లక్షల 80వేలకు పైగా సభ్యత్వ నమోదు చేయించి రికార్డ్ సృష్టించిందని పార్లమెంట్ అధ్యక్షుడు అంజినప్ప తెలిపారు. ఈనేపథ్యంలో రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలో పార్లమెంట్ అధ్యక్షుడు అంజినప్ప ఆధ్వర్యంలో ఈ సంబరాల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ ఇతర టీడీపీ ముఖ్య నాయకులు కేక్ కట్ చేసి అంజినప్పకు తినిపించి అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంజినప్ప మాట్లాడుతూ సభ్యత్వ నమోదు పార్లమెంట్‌లో మొట్టమొదటి సారిగా రాప్తాడు నియోజక వర్గంలో పరిటాల సునీత దగ్గర నుంచి ప్రారంభించామన్నారు. ఇప్పుడు రాష్ట్రంలోనే అగ్ర స్థానంలో నిలిచిన నేపథ్యంలో సంబరాలు చేసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గం రాష్ట్రంలో 14వ స్థానం, పార్లమెంట్ పరిధిలో 3వ స్థానంలో ఉం దన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 55వేల మందితో సభ్యత్వ నమోదు చేయించామని... తక్కువగా నమోదు ఉన్న నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదును సీరియస్‌గా తీసుకోవాలన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తల కృషి వల్లే సభ్యత్వాల్లో టాప్‌లో ఉన్నామని అన్నారు. రాష్ట్రంలో టాప్ 5లో ఉండేందుకు కృషి చేస్తామన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో కదిరిదే అగ్రస్థానం

విశాలాంధ్ర-కదిరి : హిందూపురం పార్లమెంట్‌లో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదులో హిందూపురం పార్లమెంట్, కదిరి నియోజకవర్గ అగ్రస్థానంలో నిలి చిందని హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ నివాసంలో పట్టణ అధ్యక్షులు ఇర్ఫాన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రియాశీలంగా పనిచేసి జిల్లాలో కదిరి నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపిన మండల, గ్రామ, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిలకు అభినందనలు తెలిపారు. ఏ కార్యకర్త కుటుంబానికైనా సమస్య వస్తే తన దృష్టికి తీసుకువస్తే అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నల్లచెరువు మండల కన్వీనర్ రాజశేఖర్, తనకల్లు మండల కన్వీనర్ రెడ్డిశేఖర్ రెడ్డి, ఎన్.పి.కుంట మండల టీడీపీ నాయకులు అంజినప్ప నాయుడు, రెడప్ప పాల్గొన్నారు.

'భూమిలోకి అడుగుపెడితే చంపుతాం..'

విశాలాంధ్ర-పుట్టపర్తి: 1978లో సాగు చేసుకునేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన భూమిని తమదంటూ కొందరు పెత్తందారులు మమ్మల్ని చంపుతామని బెదిరిస్తున్నారని గాండ్లపెంట మండలం కటారుపల్లి కి చెందిన దళితులు వెంకటరమణ, వేమనారాయణ బుధవారం పుట్టపర్తిలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రత్నాను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1978లో మా తాతలకు ప్రభుత్వం 1482 సర్వే నెంబర్ లో రెండెకరాల 41 సెంట్ల భూమిని ప్రభుత్వం పట్టా మంజూరు చేసిందని, అప్పటినుంచి భూమి సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఈ మధ్యకాలంలో కొందరు రైతులు మా భూములు మట్టి కోసం గుంతలు త్రవ్వడంతో ఆ గుంతలు పూడ్చుకునే పనిలో ఉండగా టీడీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి అనుచరులు పొలంలోకి అడుగుపెడితే చంపుతామని, కులం పేరుతో దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, వారి నుంచి మాకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని కోరారు.

జనసేనలోకి 100 కుటుంబాలు...

విశాలాంధ్ర-ధర్మవరం: జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి జనసేన పార్టీలోకి చిలకం మధుసూదన్ రెడ్డి సమక్షంలో ధర్మవరం పట్టణంలోని 40 వ వార్డు ఇంచార్జ్ వెంకటప్ప ఆధ్వర్యంలో బుధవారం తారక రామపురంకు చెందిన 100 కుటుంబాలు చేరాయి. అనంతరం చిలకం మాట్లాడుతూ పార్టీలో చేరిన వాళ్ళు బి.నారాయణమ్మ, బి.బయన్న, బి.నారప్ప, ఎజ్జే.రామచంద్ర, చిన్న రాజకుల్లాయప్ప, నాగరాజు, ఈశ్వరయ్య, బాబు, నరేష్, రాజశేఖర్, చిన్న బయన్న బాలసురప్ప,దాసరి నాగేంద్ర,చిన్న మల్లేష్, పసుపులేటి చరణ్ తేజ్, షరీఫ్, ఆదిశేషు,అనిల్,గీత,లక్ష్మీదేవి తదితరులు చేరారని, పార్టీలోకి చేరిన ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ ఏ ఆపద వచ్చిన ముందు ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యనిర్వాహణ కమిటీ సభ్యులు కడపల సుధాకర్ రెడ్డి, మిరియాల లక్ష్మీనారాయణ ,మత్స్యకార వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త శ్రీనివాసులు ,జనసేన పార్టీ పట్టణ నాయకులు డిష్ రాజు ,శేషు తదితరులు పాల్గొన్నారు.

6న కలశ ఆవాహన కార్యక్రమం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద గల శ్రీ రుక్మిణి సత్యభామ పాండురంగ స్వామి దేవాలయంలో పునర్నిర్మాణంలో భాగంగా ఐదవ తేదీ సాయంత్రం కలశవాహన కార్యక్రమం, ఆరవ తేదీ ఉదయం కలసపూజ, గోపూజ, పంచామృత అభిషేకం, హెూమాలు, పూర్ణాహుతి, ఉద్వాసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు బుధవారం ఆలయ ఈవో తెలిపారు. 6వ తేదీ ఉదయం ఉత్సవ విగ్రహములకు అభిషేకము తదుపరి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు తమ గృహములలో ఉన్న పవిత్ర గంగాజలం తీసుకొని దేవాలయానికి రావాలని, ఆలయ పునర్ నిర్మాణం కోసం భక్తులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. తెలిపారు.

షెడ్ పైకప్పు కూలి ఇద్దరు మృతి..

విశాలాంధ్ర-చిలమత్తూర్ రూరల్: శెట్టిపల్లి పంచాయతీ గ్రామంలో బుధవారం షెడ్ పైకప్పు కూలి లక్ష్మీనారాయణ రెడ్డి(54), మిడిగేసి శివారెడ్డి(52) మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మిడిగేసి శివారెడ్డి తోటలో షెడ్ నిర్మాణం చేపట్టేందుకు కూలిగా వచ్చిన లక్ష్మీనారాయణ రెడ్డి షెడ్ పైకప్పు వేస్తుండగా ఒక్కసారిగా క్రిందకు కూలిపోవడంతో అక్కడికక్కడే వారి ఇద్దరూ మృతి చెందారు, మిడిగేసి రాజశేఖర్ రెడ్డి గాయాలతో బయటపడ్డారు. లక్ష్మీనారాయణ రెడ్డి కుమారుడు సాయినాథ్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్సై మున్నీర్ అహ్మద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు,

9న డైట్ కళాశాలలో కళా ఉత్సవ పోటీలు

విశాలాంధ్ర-బుక్కపట్నం: స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాలలో 9వ తేదీన కళా ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ డైట్ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు.జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ స్కూల్స్ కాలేజీ లలో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువు విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. నృత్యస్త్ర, సంగీతం, చిత్రలేఖనం వంటి ఆరు విభాగాలలో పోటీలు ఉంటాయని, ఈనెల 7వ తేదీ తమ పేర్లను కార్యనిర్వాహకుల వద్ద నమోదు చేసుకోవాలన్నారు.

మినీ గోకులం ఏర్పాటుపై అవగాహన

విశాలాంధ్ర-చిలమత్తూర్ రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో రమణ, ఏపీఓ అప్ప స్వామి నాయుడు ఆధ్వర్యంలో మినిగోకులం ఏర్పాటుపై బుధవారం లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు, మినీ గోకులం మంజూరు అయినవారు ఈనెల 25వ తేదీలోపు పూర్తి చేయాలని తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ రంగారెడ్డి, రాష్ట్ర యస్.సి కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, నందిసప్ప, గౌరవ సర్పంచులు, ఉపాధి సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, గురువారం 05, డిసెంబర్ 2024

బదలిపై వెళ్తున్న ఎస్సైకి వీడ్కోలు..

విశాలాంధ్ర-గుడిబండ: మండల కేంద్రంలో గత మూడు సంవత్సరాలుగా విధులు నిర్వహించిన సబ్ ఇన్స్పెక్టర్ ప్రతాప్‌కు వీడ్కోలు తెలిపిన స్థానిక సర్పంచ్ కరుణాకర్ గౌడ్, ఈ క్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ మండలంలో గత రెండు సంవత్సరాలుగా విధులు నిర్వహించి మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించి హిందూపురం రూరల్ పోలీస్ స్టేషన్ కు బదిలీపై వీడ్కోలు తెలిపి అలాగే నూతనంగా గుడిబండ సబ్ ఇన్స్పెక్టర్ గా రాజుకుల్లయప్ప పదే బాధితులు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసినట్లు ఆయన తెలిపారు.

ఉపాధి హామీ పథకంలో రూ.1.23 కోట్ల అవినీతి

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలంలో 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులలో రూ, 1.23 కోట్లు రూపాయలు అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందాలు తేల్చాయి మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజా వేదిక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, డ్వామా పిడి సలీం భాష పాల్గొన్నారు. రూ,1090 కోట్ల రూపాయలతో 1386 పనులకు సంబంధించి రోడ్లు, డ్రైనేజీలు,ఇంకుడు గుంతలు, చేపట్టారు. నవంబర్ 18 వ తేదీ నుంచి డిసెంబర్ 2 వ తేదీ వరకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కూడా సామాజిక తనిఖీ బృందాలు విచారణ చేపట్టారు. అనేక గ్రామాల్లో ఉపాధి సిబ్బంది పనులు చేయకపోయినా చేసినట్లు రికార్డులు నమోదు చేసినట్లు తేల్చారు. బినామీ పేర్లతో ఉపాధి నిధులను కాజేశారు. ఉపాధి కూలీల పేరుతో పేదల కడుపు కొట్టినట్లు సామాజిక బృందాలు బట్టబయలు చేశాయి. రూ, 25.26 లక్షల రూపాయలు రికవరీ కి ఆదేశాలు జారీ చేశారు. మరో 1.37 లక్షల రూపాయలు పనులకు సంబంధించి తిరిగి విచారణ చేయాలని తెలిపారు. ఉపాధి హామీ సిబ్బందికి రూ, 1.44 లక్షల రూపాయలు జరిమానాను విధించారు.

అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి...ఉపాధి హామీ పనులలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని అవినీతి డబ్బును రికవరీ చేయాలని వామపక్ష పార్టీలకు చెందిన రైతు మరియు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

తుఫాన్ నేపథ్యంలో పంటలపై జాగ్రత్తలు తీసుకోండి

– ఎమ్మెల్యే పరిటాల సునీత...

విశాలాంధ్ర-రామగిరి: ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో పంటల విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రామగిరి మండలం వెంకటాపురం సమీపం లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారులతో కలసి వరి,కంది పంటల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాను ప్రభావం తో వరి, కంది పంటలకు నష్టం వాటిల్లితున్నట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. రైతులకు తగిన సూచనలు చేయాలన్నారు. వరి పంట గింజ పట్టే దశలో, కందిపంట పూత నుంచి కాయ వచ్చే దశలో ఉందన్నారు. ఇలాంటి సమయంలో తుఫాన్ రావడం చాలా బాధాకరమన్నారు. కోత దశలో ఉన్న వరి పంటను కోయవద్దన్నారు. అధికారులు, శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వరి పంట ఇప్పటికే కోసినట్టైతే కోసిన వరిని వదులుగా పెట్టుకుంటే.. గింజలు నల్లబడకుండా ఉంటా యన్నారు. గింజలు మొలకెత్తకుండా ఉండడానికి 20 కేజీల ఉప్పు ద్రావణం చల్లాలన్నారు. ఒకవేళ గింజ దశలో పడిపోయినట్లయితే నీరు బయటకి తీసివేయాలన్నారు. గింజలు మొలకెత్త కుండా ఐదు శాతం ఉప్పు ద్రావణం వెన్నులపైన పిచికారి చేయాలన్నారు. ఏరువాక కేంద్రం కోఆర్డినే టర్ డాక్టర్ కే.రామ సుబ్బయ్య, మండల వ్యవసాయ అధికారి ఉదయ్ కుమార్, పాల్గొన్నారు.

ఓవర్ లోడుతో వెళ్తే చర్యలు

విశాలాంధ్ర-రాప్తాడు : ప్రయాణికులను చేరవేసే వాహనాలు, వస్తువులను తీసుకెళ్లే వాహనాలు అధిక లోటుతో వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాప్తాడు సీఐ టీవీ శ్రీహర్ష హెచ్చరించారు. రాప్తాడు 44వ జాతీయ రహదారిపై బుధవారం వాహనాల తనిఖీ చేపట్టి రికార్డులను పరిశీలించారు. ఆటోలు, బొలెరో వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను గమ్యస్థానాలకు తీసుకెళ్లేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని వాహన యజమానులను ప్రశ్నిం చారు. ఆటోలు, టూవీలర్ల వాహనాలకు సరైన రికార్డులు లేకపోవడంతో అపరాధ రుసుం విధించారు. వాహన తనిఖీల్లో తలారి మాధవ గంగరాజు, శంకరరెడ్డి ఉన్నారు.

రేపటి నుండి రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర-రాప్తాడు : రేపటి నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ పి.విజయకుమారి తెలిపారు. ఈనెల 6వ తేదీ బొమ్మేపర్తి, 7న గాండ్లపర్తి, 10న గంగలకుంట, 11న ఎర్రగుంట, 12న బుక్కచెర్ల, 13న యం.బండమీదపల్లి, 17న పాలచెర్ల, 18న మరూరు, 19న గోళ్లపల్లి, 20న చెర్లోపల్లి, 21న హంపాపురం, 24న గొందిరెడ్డి పల్లి, 26న రాప్తాడు, 27న ప్రసన్నాయపల్లి గ్రామాల్లో ఉంటా యన్నారు. ఆయా సచివాలయాల్లో భూ సమస్యలు, రేషన్ కార్డులకు సంబంధించి రైతులు, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కార మార్గం చూపుతామన్నారు.

బాధితులను పరామర్శించిన బొంబాయి రమేష్ నాయుడు

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని వేములపాడు గ్రామంలో వైసీపీ కార్యకర్తలపై సోమవారం రోజున టీడీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.గాయపడిన చిన్న పుల్లారెడ్డి, పెద్ద పుల్లారెడ్డిలను యాడికి వైసిపి మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు అనంతపురం గవర్నమెంట్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్, రామేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి రెవిన్యూ గ్రామసభలు

విశాలాంధ్ర-రొళ్ల: రెవిన్యూ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 6 నుంచి రెవిన్యూ గ్రామాలు వారిగా 11రోజుల పాటు రెవిన్యూ గ్రామసభలు నిర్వహిస్తునట్లు తహసీల్దార్ షేక్షావలి తెలిపారు.6న హెూట్టెబెట్ట 13న రొళ్ల-1 గ్రామ సచివాలయంలో 18న రొళ్ల-2గ్రామ సచివాలయంలో గ్రామసభ ఉంటుందన్నారు 19న యం.రాయపురం 20న మల్లినమడుగు 26న బి.జి హళ్లి 27న హులికుంట 2న గుడ్డుగురికి 3న రత్నగిరి 7న కాకి 8న దొడ్డేరి తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్నా రైతులు తమ తమ పరిధిలో జరిగే గ్రామసభలకు వెళ్లి తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ షేక్షావలి సూచించారు.

అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని హాస్పిటల్‌కి తరలించిన పోలీసులు

విశాలాంధ్ర-పుట్టపర్తి : పుట్టపర్తి మండలంలోని గంట్ల మారెమ్మ గుడి వెనుక, అనారోగ్యంతో నిరసించి ఓవృద్ధుడు పడిపోయాడు. పుట్టపర్తి రూరల్ పోలీసులుకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు 108 ద్వారా హాస్పిటల్ కు తరలించారు. వృద్ధుడు పేరు ఎర్రోడు అని సింగిరెడ్డి పల్లి గ్రామం, గోరంట్ల మండలంకు చెందినవారుగా గుర్తించారు .వీరిని 108 అంబులెన్సు లో గంటలమారెమ్మ కమిటీ వారి ద్వారా ఒక మనిషిని పెట్టి, వారి కొడుకుతో మాట్లాడి గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం పంపడం జరిగింది. సమాచారం ఇచ్చిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని వృద్ధున్ని ఆసుపత్రికి తరలించడం పట్ల పోలీసులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సబ్ ఇన్స్పెక్టర్‌గా రాజా కుళ్ళాయప్ప

విశాలాంధ్ర-గుడిబండ: గుడిబండ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్‌గా శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలో రెండు సంవత్సరాలుగా విధులు నిర్వహించి అనంతరం విఆర్ నుండి బదలిపై గుడిబండ పోలీస్ స్టేషన్‌లో రాజ కుళ్లాయప్ప నూతన బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో మట్కా పేకాట అక్రమ మద్యం మొదలైన అసాంఘిక కార్యకలాపాలు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుడిబండ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఆన్యం మునిప్రతాప్ హిందూపురం రూరల్ పోలీస్ స్టేషన్ కు బదిలీపై వెళ్లారు. ఈ క్రమంలో నూతనంగా ఎస్సైగా బతికి బాధ్యతలు స్వీకరించిన రాజు కుళ్లాయప్ప లను అలాగే బదిలీపై వెళ్తున్న సబ్ ఇన్స్పెక్టర్ ఆన్యం ముని ప్రతాప్ లను ఘనంగా సన్మానించారు.

నూతన సీఐని కలిసిన కనుమ ప్రభాకర్

విశాలాంధ్ర-ముదిగుబ్బ : ముదిగుబ్బ అర్బేడ్ పోలీస్ స్టేషన్లో కొత్తగా విధులకు హాజరైన సీఐ శివ రాముడు, ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం శ్రీ సత్యసాయి జిల్లా వాల్మీకి బోయ సంఘం అధ్యక్షులు కనుమ ప్రభాకర్ సిఐని కలిశారు. ఈ సందర్భంగా ముదిగుబ్బ మండలంలోని వాల్మీకి బోయలను గురించి చర్చించడం జరిగిందన్నారు. సీఐ శివరాముడును కలసి పూలమాలవేసి,దుశాలవా కప్పి సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వాల్మీకి బోయ సంఘం నాయకులు చిల్లా ప్రకాష్, నాగరాజు,మల్లికార్జున,కొత్తకోట మల్లికార్జున, కర్ణాకర్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నవజ్యోతుల మహోత్సవములో చంద్రమౌళి

విశాలాంధ్ర - యాడికి : యాడికి మండల కేంద్రంలో తొగటవీర క్షత్రియులు శ్రీ చౌడేశ్వరి దేవి నవజ్యోతుల మహోత్సవాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశాలాక్షి సేవా సంస్థ అధ్యక్షుడు గుండా నారాయణస్వామి ఆహ్వానం మేరకు రోల్ బాల్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మరియు కాయల్ బోర్డు మెంబర్ అయిన చంద్రమౌళి గారు పాల్గొన్నారు, ఈ సందర్భంగా చంద్రమౌళి శ్రీ చౌడేశ్వరి మాత ఆలయంలో వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం తొగట వీర క్షత్రియులు అమ్మవారికి ప్రతిరూపమైన జ్యోతులను తలపై పెట్టుకుని అమ్మవారి భజనలను పాడుతూ చేస్తున్న నృత్యాలను చూసి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు, జ్యోతులను అగ్నిగుండ ప్రవేశం చేసిన హెూమగుండాన్ని నమస్కరించారు. అనంతరం చేనేత కార్మికుల సమస్యలపై చర్చించారు, ఈ కార్యక్రమంలో శ్రీరామ గ్రూప్స్ అధినేత రామిరెడ్డి, విజన్ స్కూల్ కరస్పాండెంట్ విశ్వనాథ్, ఖాదీ సంస్థ సభ్యులు లింగం చంద్రశేఖర్, నారాయణ, వీర, గుండా ఓబులేసు, మురళి, రుక్కు ప్రసాద్, కుండా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

విశాలాంధ్ర-గుత్తి : పట్టణం విద్యుత్ చార్జీలు పెంపునకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ పార్టీ కన్వీనర్లు హుస్సేన్ పీరా ,గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వైసీపీ నాయకులతో కలిసి విద్యుత్ చార్జీలు తగ్గించాలని,అలాగే ఎస్సీలకు 200 యూనిట్లుఫ్రీ కరెంటును కొనసాగించాలని కోరుతూ విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గించాలని,అలాగే ఎస్సీలకు ఇస్తున్న 200 యూనిట్లు ఉచిత కరెంటుని కొనసాగించాలని, గత ఎన్నికలకు ముందు కరెంటు చార్జీలు ఎటువంటి పరిస్థితుల్లో పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత చార్జీల పెంపు ఎంతవరకు సమంజసం అని , ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దిగివచ్చి విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని లేకుంటే ముున్ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. అదేవిధంగా సమస్యల తో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్ అధికారి కు వినతి పత్రం సమర్పించారు. పట్టణ మండల కన్వీనర్లు హుస్సేన్ పీరా,గోవర్ధన్ రెడ్డి,అనంతపురం వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు సివి.రంగారెడ్డి,మాజీ జెడ్పిటిసి ప్రవీణ్ కుమార్ యాదవ్, జిల్లా సీనియర్‌నాయకులు మల్లయ్యయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించండి

విశాలాంధ్ర-బుక్కరాయసముద్రం:మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే గ్రామ ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది మెరుగైన వైద్య సేవలను అందించాలని మండల పరిషత్ అధ్యక్షురాలు దాసరి సునీత సూచించారు. బుధవారం స్థానిక ఆసుపత్రి ప్రాంగణంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన మండల పరిషత్ అధ్యక్షురాలు దాసరి సునీత మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అందించే ఔట్ పేషెంట్ ,ఇన్ పేషంట్ సేవలకు ఎలాంటి

ఇబ్బందులు లేకుండా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆస్పత్రి పని వేళల్లో అన్ని విభాగాలు సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరంగా వైద్య సేవలను అందించాలన్నారు. వైద్యాధికారి కొండమ్మ మాట్లాడుతూ కుక్కకాటు ఇంజక్షన్ కోసం మారుమూల ప్రాంతాల నుంచి ప్రజలు వస్తున్నారని, అయితే ఈ వ్యాక్సిన్ నిల్వ ఉంచడానికి ఫ్రిజ్ లేక ఇబ్బంది పడే వారమని, ఎంపీపీ సునీత అందించిన ఫ్రిజ్ వల్ల వ్యాక్సిన్ నిలువ చేసుకొని ప్రజలకు సమయానికి కుక్క కట్టు వ్యాక్సిన్ వేసే అవకాశం ఉంటుందన్నారు. ఎంపీపీ దాసరి సునీత కు ఆసుపత్రి సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మోహన్ రావు ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యంతర భృతిని తక్షణమే ప్రకటించాలి : ఏపిటిఎఫ్

విశాలాంధ్ర-గుత్తి: పట్టణం స్థానిక ఉర్దూ పాఠశాలలో జిల్లా ఉపాధ్యక్షులు దేశాయి నాగరాజు ఆధ్వర్యంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జోనల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పూర్వ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సిరాజుద్దీన్ మాట్లాడుతూ పిఆర్సి కమిటీ పునర్వ్యవస్థీకరణ , తక్షణమే 30% ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 11వ పిఆర్సి ముగిసిపోయి. 14 నెలలు గడుస్తున్నందున ఐఆర్ కోసం ఉద్యోగులు ఎదురు చూస్తున్నారని వెంటనే పిఆర్సి కమిషన్ నియమించి 30% శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలని పీఆర్సీ, డీఏ అరియర్స్ బకాయిలు చెల్లించాలని ఓపిఎస్ అమలు పై నిర్ణయం కోసం సీపీఎస్ బాధితులు ఎదురు చూస్తున్నారని గ్రామీణ విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసి ప్రభుత్వ పాఠశాల రంగాన్ని అతలాకుతలం చేస్తున్న జీవో నెంబర్ 117 ను తక్షణ రద్దు చేయాలని తల్లికి వందనం పేరుతో ఇచ్చే ఆర్థికలబ్ధిని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని అనంతపురం జిల్లాలో పెండింగ్ ఉన్న ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ ప్రొమోషన్లను, తెలుగు, హిందీ, ఉర్దూ ప్రొమోషన్లను చేపట్టాలని,12 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న ఎస్జిటి ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ పరిగణించాలని, ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి విద్య హక్కు చట్టం మేరకు నిర్ణయించాలని, ప్రతి గ్రామంలోనూ 1 నుండి 5వ తరగతి వరకూ సమాంతర భోధ సమాధ్యమాల్లో ఉండేలా చూడాలని ఏంటీఎస్ ఉపాధ్యాయులకు 12 నెలలు జీతం చెల్లించాలని వారికి కూడా బదిలీలు చేపట్టాలని,100 రోజుల యాక్షన్ ప్లాన్ సవరించాలని సెలవు రోజులలో అనగా రెండవ శనివారం ఆదివారం రోజు తరగతు నిర్వహించరాదని, ప్రభుత్వం పై సమస్యల మీద వెంటనే స్పందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి. నరసింహులు ,జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సిరాజుద్దీన్ ,జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ ప్రేమావతి,రామచంద్ర, నాయకులు సయ్యద్ భాష,లక్ష్మణ్,దాదా ఖలందర్,వారిస్ అలీ,నూర్ మొహమ్మద్, నాగరాజు,హరి,రాజేష్,బాలరాజు,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి పంటపై మెలుకవలు

విశాలాంధ్ర- శెట్టూరు: మండల పరిధిలో కనుకూరు, చింతర్లపల్లి గ్రామంలో మామిడి పూత దశలో చేపట్టవలసిన ఈ యాజమాన్యం పద్ధతుల గురించి రైతులకు వివరించారు. బుధవారం కనుకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డా.యుగంధర్ ప్రస్తుతం మామిడి పంటల్లో వస్తున్నటువంటి మార్పులను బట్టి మనం ఏవిధంగా పంటను కాపాడుకోవాలి అని రైతుల తెలియజేశారు ప్రస్తుతం ఎక్కువగా మామిడి పంటలో తేనె మంచు పురుగు ఎక్కువగా కనిపిస్తుంది, తేనెమంచు పురుగును ఏ విధంగా కంట్రోల్ చేయాలని రైతులకు తెలియజేశారు. అన్నం వార్చినటువంటి గంజిని స్ప్రే చేయడం వలన రెండు మూడు రోజులలో అట్ట మాదిరిగా ఉడిపోవడం వలన ఈ విధంగా నివారించవచ్చును, పంట కోత అయిన వెంటనే జూన్ నెలలో కత్తిరింపులు చేపట్టవలెను మరియు అదే విధంగా పచ్చిరొట్ట ఎరువులను జీలుగా, ఉలవలు వేయడం వల్ల భూసారం పెరుగుతుంది. నీటి యొక్క ఎద్దడి తక్కువగా ఉంటుంది. రైతులు తనకు ఉన్నటువంటి పొలంలో విడతలవారీగా పంటలను సాగు చేసుకోవాలి అదేవిధంగా అందరూ రైతులు ఒకేసారి ఒకే పంటను సాగు చేసుకోకుండా ఉన్నంతలో విడతల వారీగా కొంతవరకు టమోటో,వేరుశనగ, వివిధ రకాల పంటలు సాగు చేసుకోవాలి అదే విధంగా ఎప్పటికప్పుడు పంట మార్పిడి చేయడం వల్ల భూమి సారవంతం అవుతుంది వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్టికల్చర్ అధికారి గౌసియా బేగం,వ్యవసాయ విస్తరణ అధికారి ఆంజనేయులు, విలేజ్ అగ్రికల్ అసిస్టెంట్ వీరాంజనేయులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సమావేశాలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-రొళ్ల: జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు ఈనెల 7వ తేదీన జరిగే తల్లిదండ్రుల సమావేశాన్ని ప్రతి పాఠశాలలో విజయవంతం చేయాలని మండల విద్యాధికారి ఎస్.శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలో ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల7న జరగాల్సిన తల్లిదండ్రుల,ఉపాధ్యాయుల కమిటీ సమావేశంలో అనుసరించాల్సిన కార్యక్రమాల గురించి ప్రధానోపాధ్యాయులకు తెలియజేశారు ముఖ్యంగా ఉపాధ్యాయులు విద్యార్థుల చేత తయారు చేయబడిన ఆహ్వాన పత్రికలను తల్లిదండ్రులకు అందించి వారిని ఆహ్వానించాలని తల్లిదండ్రుల సమావేశ నిర్వహణకు సంబంధించిన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు విద్యార్థుల ఓలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల మీద పర్మనెంట్ మార్కర్ లేదా సిడి మార్కులతో మాత్రమే రాయాలని అదేవిధంగా విద్యార్థులకు ఆట పోటీ నిర్వహించి బహుమతులు ప్రధానం చేయాలన్నారు తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థి యొక్క ప్రగతిని గట్టిగా చదివి వారికి వినిపించాలన్నారు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా తోరణాలతో అలంకరణ చేసుకోవాలని ఈ సమావేశంలో ప్రతి అంశాన్ని మినిట్ బుక్‌లో పొందుపరిచాలన్నారు. ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-పెనుకొండ: శ్రీ బాబయ్య స్వామి క్రీడా ఉత్సవాలను బుధవారం ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల విద్యాధికారి సుధాకర్, సిఐ రాఘవన్ మరియు ఎస్సై వెంకటేశ్వర్లు, ప్రారంభించారు వారి సందర్భంగా మాట్లాడుతూ ప్రయత్నం చేసే వారికి ఓటమి అనేది ఉండదు. కానీ గెలుపులు ఓటములు సహజమే సిఐ రాఘవన్ హజరత్ బాబా ఫక్రుద్దీన్ ఏ శ్రీశ్రీ శ్రీ బాబయ్య స్వామి 752వ, ఉరుసు సందర్భంగాప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అండర్ స్కూల్స్ లెవెల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ను దర్గా పీఠాధిపతి కె ఎస్ ఎస్ బి తాజ్ బాబా కుమారుడు కాబోయే పీఠాధిపతి కె ఎస్ ఎస్ బి నజర్ హుసేనీ గారి ఆధ్వర్యంలో దర్గా ప్రాంగణంలో క్రీడలు ఘనంగా నిర్వహించారు. ఈ క్రీడల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు గెలుపొందిన విద్యార్థులకు ఉరుసు రోజున పీఠాధిపతి చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయుచున్నారు.

చింతతోపుల ద్వారా పంచాయతీలకు ఆదాయం

విశాలాంధ్ర - అగళి : మండలంలోని ఇనగలూరు రాగినింగణపల్లి చింత తోపులకు బుధవారం వేలం పాట నిర్వహించారు. సర్పంచ్‌లు సన్నమ్మ రంగప్ప, మంజుల నటరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇనగలూరు చింత తోపును పలారం నాగరాజు ఎచ్చు పాట పాడి 50 వేలకు దక్కించుకొన్నారు. రాగినింగనపల్లి చింతతోపును అఖిం సాబ్ ఎచ్చు పాట పాడి 72 వేలు రూపాయలకు దక్కించుకున్నాట్లు ఈ ఓ ఆర్ డి పద్మ పంచాయతీ కార్యదర్శి రంగనాథ్ తెలిపారు. వేలం పాట ద్వారా వచ్చిన మొత్తాన్ని బ్యాంక్ లకు జమ చేసినట్లు తెలిపారు.

మెప్మా పరిధిలో డేటా సేకరించండి

విశాలాంధ్ర-పుట్టపర్తి : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా అధర్వంలో స్వయం సహాయక సంఘాల సభ్యుల సమగ్ర డేటా సేకరించాలని ఉమ్మడి జిల్లాల మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ జె. విశ్వ జ్యోతి పేర్కొన్నారు. బుధవారం పట్టణ మెప్మా కార్యాలయంలో సంఘాల ఆర్ పి ప్రతినిధులకు అవగాహన సదస్సు లో వివిధ అంశాలను డైరెక్టర్ వివరించారు. మొబైల్ యాప్ ద్వారా ఆర్పీలకు లాగిన్ ఇచ్చి పరిధిలోగల సంఘాల సభ్యుల డేటాను మెప్మా వెబ్ సైట్ నందు సమగ్ర సమాచారం పొందుపరచాలన్నారు. తద్వారా ప్రభుత్వ పథకాలను మరింత పటిష్టంగా పారదర్శకంగా అమలు చేయుటకు అవకాశం ఉంటుందన్నారు. గత నెలలోనే పూర్తి చేయాల్సిన డేటా పూర్తికానందున మరో 10 రోజులలో పూర్తి చేయాలని ఆర్పీలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు ఎస్. భవాని, కాటమయ్య, డీఎంసీ శ్రీనివాసరెడ్డి, మెప్మా టౌన్ మిషన్ కోఆర్డినేటర్ ఎస్. రమాదేవి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు దూద్ పీర్, వి. ధరణి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మండలం ఇంద్రావతి గ్రామంలో రూ, 5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ సహకారంతో ఉపాధి హామీ నిధులతో రోడ్లు డ్రైనేజీలను నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ వెంకటేశులు,సుధాకర్, గోపాల్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

పల్లెలో పొలం పిలుస్తుంది

విశాలాంధ్ర-కణేకల్లు: బుధవారం సోల్లాపూరం హన్మాపురం గ్రామాలలో పొలంపిస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా రైతులు ఉద్దేశించి మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పప్పు సెనగ రైతుల స్వచ్ఛందం గా రైతుల ప్రీమియం చెల్లించుకోవచ్చు అని రైతులకు విజ్ఞప్తి చేయడం జరిగింది. చివరి తేదీ ఈ నెల 15 వరకు ఉందని ఒక ఎకరానికి 450 కట్టుకోవాలన్నారు. డోక్రా మహిళల గ్రూపు ద్వారా నమ డ్రిన్ దిది పథకం అములు చేయడానికి 80% పర్సెంట్ రాయితీ వర్తిస్తుంది. ఆసక్తిగల రైతులు మహిళ సంగాల ద్వారా ర అప్లికేషన్ పెట్టుకోవాలని సూచించారు. ఇటీవల కురిసిన వర్షానికి వరి ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులను వ్యవ సాయ అధికారి కలిసి పరామర్శించారు. వరి కేంద్రం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు నివేదికలు పంపాలని రైతులకు ధైర్యం చెప్పారు. రైతుల తమ ధాన్యాం తేమశాతాన్ని 17% కంటే తక్కువ ఉంటే విధంగా ఉన్నప్పుడే కొనుగోలు చేయుటకు సాధ్యపడుతుందని రైతులు తగు విధంగా ఉన్నప్పుడు కొనుగోలు చేయుటకు సాధ్యపడుతుందని రైతులు తగు చర్యలు తీసుకోవా ల్సిందిగా సూచించారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో హనుమాపురం సర్పంచ్ యన్, జయరాం చౌదరి మరియు సోలాపురం ఎంపీటీసీ కేశవరెడ్డి ఇతరు గ్రామ పెద్దలు ఆర్.బి.కె సిబ్బంది అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు చేసుకోండి

విశాలాంధ్ర-గోరంట్ల: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టీడీపీ నాయకులు కార్యకర్తలు బాగుకోసం వారి సంక్షేమమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఐదు లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఈ అవకాశాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ఆదేశాల మేరకు గోరంట్ల పట్టణంలోని పులేరు రోడ్డు బూత్ నెంబర్ 240లో మండల కన్వీనర్ సోమశేఖర్, బూత్ ఇంచార్జ్ వాల్మీకి సోమశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. గోరంట్ల మండల కన్వీనర్ సోమశేఖర్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం కార్యకర్తల కోసం నిరంతరం పనిచేస్తుందని అందులో భాగంగా ప్రతి టీడీపీ సభ్యత్వం పొందిన ప్రతి ఒక్క కార్యకర్తకు ఐదు లక్షల రూపాయలు ప్రమాద బీమా అందిస్తుందని ప్రజా సంక్షేమం తెలుగుదేశం ప్రభుత్వం తోనే సాధ్యం అని ప్రజలంతా స్వచ్ఛందంగా కదలివచ్చి టీడీపీ సభ్యత్వం పొందుతున్నారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్య క్రమంలో టిడిపి మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ అబ్బుతుల్ల,బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతుల మహోత్సవానికి హాజరైన బాల రమేష్ బాబు

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని చౌడేశ్వరి దేవి జ్యోతుల మహోత్సవానికి యాడికి మండల సీనియర్ నాయకులు బాల రమేష్ బాబు బుధవారం హాజరయ్యారు. చౌడేశ్వరి దేవి కార్తీక మాస జ్యోతుల మహోత్సవం సందర్భంగా. పురవీధుల్లో తిరిగే జ్యోతుల మహోత్సవానికి హాజరై దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు కల్లమడి రామ్మూర్తి. భాస్కర్ రెడ్డి. సుబ్బారెడ్డి. ఎరికలప్ప. సుద్దల కృష్ణ. 1 వార్డు బూసి. వెంకటేష్. దేరంగుల శివశంకర్. రమణ మాభూషణ్ .కరుణాకర్ చేనేత కార్మిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.